టీడీపీకి ఇవే చివరి ఎన్నికలు

- ప్రజలంతా వైఎస్సార్‌సీపీకి మరోసారి పట్టం కట్టేందుకు సిద్ధం
- సంక్షేమ పథకాల అమల్లో సీఎం జగన్ నూతన ఒరవడి
- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి



ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న మహిళలు

బిట్రగుంట: రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చిన టీడీపీకి రానున్న ఎన్నికలే చివరి ఎన్నికలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. గత ఎన్నికల్లో 23 సీట్లకు దిగజారిన టీడీపీని రానున్న ఎన్నికల్లో పూర్తిగా తరిమి కొట్టేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వైఎస్సార్ ఆసరా మూడో విడత పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఆసరా సాయంతో ఆర్థిక స్వావలంబన సాధించిన మహిళలు కేక్‌కట్ చేసి ఎమ్మెల్యేకి తినిపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఎమ్మెల్యేతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డి ఆసరా మూడో విడత కింద మండలంలోని 750 పొదుపు సంఘాలకు సంబంధించి 7,875 మంది మహిళలకు రూ.5.56 కోట్ల మెగా నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళా సాధికారతపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారని తెలిపారు. టీడీపీ హయాంలో ఉనికి కోల్పోయిన పొదుపు సంఘాలకు పూర్వ వైభవం తీసుకువచ్చేలా క్రమం తప్పకుండా ఆసరాతో సాయం చేసినట్లు తెలిపారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా పలు పథకాలు అమలు చేసినట్లు వివరించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలే కాకుండా అనేక కొత్త పథకాలు కూడా అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. గ్రామ వలంటీర్లు, సచివాలయ వ్యవస్థతో ఉద్యోగ విప్లవం సృష్టించడంతో పాటు ప్రభుత్వ పథకాలను నేరుగా పేదల ముంగిటకే తీసుకువెళ్లారని తెలిపారు. రైతు భరోసా కేంద్రాలతో అన్నదాతలకు అండగా నిలవడం, నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దడం, అమ్మ ఒడి ద్వారా పిల్లలను చదివించే తల్లులకు ఆర్థిక భద్రత కల్పించడం, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పథకాలతో విద్యార్థులకు అండగా నిలవడం తదితర పథకాలు దేశమంతా రాష్ట్రం వైపు చూసేలా చేశాయన్నారు. నవరత్నాల్లో భాగంగా దేశంలో ఎక్క డా లేని విధంగా పేదలందరికీ నివేశన స్థలాలు పంపిణీ చేయడంతో పాటు ఇళ్లు కట్టిస్తున్న ఘనత కూడా సీఎంకే దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీకి, ముఖ్యమంత్రికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక చంద్రబాబు మతిస్థిమితం లేని మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కావలి ఆర్డీఓ శీనానాయక్, తహసీల్దార్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ గోవిందరావు వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దిబోయిన వీరరఘు, ఎంపీపీ మేకల సుజాత, జెడ్పీటీసీ మద్దిబోయిన కీర్తన, నాగులవరం పీఏసీఎస్ అధ్యక్షుడు సుంకే మాల్యాద్రి, సర్పంచ్‌లు పందిపాటి అనిత, బండ్ల సురేష్, ఉప్పాల మాచర్ల, ప్రభాకర్‌రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మాధవరెడ్డి, ఎంపీటీసీలు సుందర్ రాజు, మందా కౌసల్య, మల్లి మోహన్, కో-ఆప్షన్ సభ్యులు నాయబ్ రసూల్, నాయకులు తూపిరి పెంచలయ్య, మేకల శ్రీనివాసులు, గండూరి శ్రీనివాసులు, సమీవుల్లా, పాపన మల్లారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

గరుడి వాహనంపై వేణుగోపాలుడి విహారం



గరుడ వాహనంపై వేణుగోపాలస్వామి

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరులో కొలువైన రుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి, అమ్మవార్లను గరుడ వాహనంపై విశేషంగా పుష్పాలంకరణ చేసి గ్రామోత్సవం నిర్వహించారు. ఉభయకర్తలుగా ఆలయ ధర్మకర్త పొన్నవోలు నారసింహారెడ్డి కుటుంబీకులు వ్యవహరించారు.

ఊరూరా నవమి శోభ



చెర్లోయడవల్లిలో శ్రీరామ చంద్రుడికి హనుమంత సేవ

ఆత్మకూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామ నవమిని పురస్కరించుకుని వేడుకలు కోలాహలంగా నిర్వహిస్తున్నారు. చెర్లోయడవల్లిలో కుడుముల శేషిరెడ్డి కుటుంబీకులు ఉభయకర్తలుగా నిర్వహించిన హనుమంత సేవలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. బసవరాజుపాళెం, నబీనగరం గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి. భక్తులకు ఉభయకర్తలు అన్నదానాలు నిర్వహిస్తున్నారు.

సీతారాముల గ్రామోత్సవం



సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అనుమసముద్రంపేట: మండలంలోని హసనాపురంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా సీతారాముల గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలు తొగట వీర క్షత్రియులు ఆధ్వర్యంలో కోదండరామస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గరుడ వాహనంపై సీతారాముల ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు.

నేత్రపర్వం.. సీతారాముల కల్యాణం



నవవధూవరులుగా సీతారాములు

సంగం: మండలంలోని కోలగట్లలో కొలువైన కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామి, అమ్మవార్లను పరిమళ పుష్పాలతో అలంకరించి మండపంపై కొలువుదీర్చి అత్యంత వైభవంగా కల్యాణాన్ని నిర్వహించారు. పుచ్చలపల్లి రవీంద్రరెడ్డి, రాధిక దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. నరసింహారెడ్డి, వెంకటరమణారెడ్డి, జయరామిరెడ్డి ఆలయ కార్యనిర్వాహకులుగా వ్యవహరించారు.

చలివేంద్రం ప్రారంభం

కలిగిరి: కలిగిరిలోని పోలీస్‌స్టేషన్ వద్ద మన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆ సంస్థ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి ఉదయగిరి నియోజకవర్గం పరిధిలో 30 చలివేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



గడపగడపలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రాష్ట్రంలో పేదలు అభివృద్ధి చెందాలని సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ అభివృద్ధి సాధిస్తున్నామని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని రుద్రకోటలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రభుత్వం అందించే పథకాల వివరాలు తెలుసుకుంటుంటే సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కుల మతాలకు అతీతంగా అందరికీ సమానంగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు తమకు అండగా నిలుస్తున్నాయని, ఆర్థికంగా భరోసా కల్పిస్తున్నాయని, జగనన్న పాలనలో తామంతా చాలా సంతోషంగా ఉన్నామని ప్రజలు ఎంతో ఉత్సాహంగా జై జగన్ అంటూ నినాదాలు చేస్తూ జగనన్నకు మా ఆశీస్సులు ఉంటాయని దీవిస్తున్నారన్నారు. ప్రతి పల్లెను ఆదర్శవంత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రామాయపట్నం పోర్టు, దామవరం విమానాశ్రయం వంటి భారీ ప్రాజెక్ట్‌లతో కావలి కనకపట్నం కాబోతుందని అది జగనన్న ప్రభుత్వం వల్లే సాధ్యమన్నారు. అనంతరం ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకుంటూ ఆయా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

92 శాతం పింఛన్ల పంపిణీ



అప్పారావుపాళెంలో లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీరు



కావలి: పట్టణంలోని మూర్తిశెట్టివారివీధిలో దివ్యాంగ వృద్ధురాలికి ఆమె నివాసంలో పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీర్ అనూష

ఆత్మకూరురూరల్: మండలంలోని 11 సచివాలయాల పరిధిలో రెండో రోజు బుధవారం నాటికి 92 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. మొత్తం 4,919 మంది లబ్ధిదారులకు రూ.1,36,22,250 పింఛన్ల మొత్తం ప్రభుత్వం మంజూరు చేసిందని ఇందులో 4,513 మందికి రూ.1,24,98,250 వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది ద్వారా నేరుగా పంపిణీ చేశామని తెలిపారు.

వేగంగా పింఛన్ల పంపిణీ

కావలి: కావలి నియోజకవర్గంలో రెండు రోజులుగా 'వైఎస్సార్ పింఛను కానుక' పంపిణీ ప్రక్రియను వలంటీర్లు వేగంగా చేస్తున్నారు. ఈ నెల 1, 2 తేదీల్లో సెలవులు ఉండడం, 3వ తేదీ బ్యాంకులు నుంచి నగదు అందడంలో జాప్యం చోటు చేసుకోవడంతో 4వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో వలంటీర్లు క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల నివాసాలకు వెళ్లి పింఛన్ నగదును శరవేగంగా పంపిణీ చేస్తున్నారు. కావలి పట్టణంలో 10,106 మంది లబ్ధిదారులు ఉండగా, ఇప్పటి వరకు 9,400 మందికి, కావలి రూరల్ మండలంలో 7,962 మంది ఉండగా, 7,000 మందికి అందజేశారు. దగదర్తి మండలంలో 5,439 మంది ఉండగా, 5,000 మందికి, అల్లూరు మండలంలో 7,274 మంది ఉండగా, 6,854 మందికి, బోగోలు మండలంలో 6,072 మంది ఉండగా, 5,750 మందికి పింఛన్ పంపిణీ చేశారు.

రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోండి

సోమశిల: రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా కోసం నూతనంగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించిందని, అర్హత కలిగిన రైతులు వైఎస్సార్ రైతు భరోసా కోసం రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని ఏఓ శ్రీధర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే రైతులు పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, రైతు ఫొటో, బ్యాంక్ అకౌంట్ జెరాక్స్‌లతో సంప్రదించాలని కోరారు.

వైద్యశాల ఆవరణలో కంపచెట్ల తొలగింపు



కంపచెట్లు తొలగిస్తున్న జేసీబీ

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో ఏపుగా పెరిగిన కంప కర్ర చెట్లు, పిచ్చి మొక్కలకు నిలయంగా మారి, విష పురుగులు సంచరిస్తుండడంతో బుధవారం గ్రామానికి చెందిన జీఎంకే ట్రస్ట్ అధినేత, వైస్ ఎంపీపీ గుంటుపల్లి మాలకొండయ్య చౌదరి జేసీబీ సహాయంతో కంపచెట్లు, మొక్కలు తొలగించి శుభ్రం చేయించారు. వైద్యశాల భవనం గత కొంతకాలం నుంచి మరమ్మతులకు గురై పాడుబడి పోయింది. ఇటీవల మరమ్మతులు పూర్తి చేసి త్వరలో భవనాన్ని పునః ప్రారంభించి వైద్య సేవలు అందించనున్న నేపథ్యంలో సిబ్బంది, రోగుల సౌకర్యార్థం తన సొంత నిధులతో వైద్యశాల పరిసరాలను శుభ్రం చేయించారు. వైద్యశాల ఆవరణలో పూలమొక్కలు, ఫలసాయాన్ని ఇచ్చే చెట్లు నాటేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు వెంకటేశ్వర్లు, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో మహిళపై దాడి

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాలో బుధవారం ఓ మహిళా భక్తురాలిపై స్థానిక మహిళలు దాడి చేశారు. బాధిత మహిళ సమాచారం మేరకు.. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సకియాబేగం దర్గాను దర్శించుకునేందుకు బుధవారం వచ్చారు. సాయంత్రం అన్నదానం సమయంలో స్థానిక మహిళలకు, సకియాబేగం మధ్య వివాదం తలెత్తింది. దీంతో స్థానిక దర్గా ప్రాంతానికి చెందిన మహిళలు దాడి చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బడుగుల ఆశాజ్యోతి జగ్జీవన్ రామ్



ఆత్మకూరు: మున్సిపల్ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు

ఆత్మకూరు: దేశంలోని బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విశేష కృషి చేశారని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు అన్నారు. జగ్జీవన్ రామ్ 115వ జయంతిని బుధవారం ఆత్మకూరులోని పలు కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, ఇన్‌చార్జి కమిషనర్, ఏఈ జూపల్లి ప్రసాద్ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ షేక్ సర్దార్, ఆర్‌ఐ ఖాసీం, మున్సిపల్ సిబ్బంది సురేష్, కోటేశ్వరరావు, సుభాన్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. రవాణాశాఖ కార్యాలయంలో ఎంవీఐ రాములు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఎమ్మార్పీఎస్ నేతలు జగ్జీవన్ రామ్ జయంతిని నిర్వహించారు.

సోమశిల: ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం బాబూజగ్జీవన్‌రాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ బాబు జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ మధుసూదన్‌రావు, వైఎస్సార్‌సీపీ నేత పెయ్యల ఈశ్వరయ్య, సిబ్బంది ఉన్నారు.

చేజర్ల: బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా బుధవారం ఆయన చిత్ర పటానికి తహసీల్దార్ శివకృష్ణయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

అనుమసముద్రంపేట: మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో బాబూ జగ్జీవన్‌రాం జయంతిని వేడుకలు నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయంలో వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా జగ్జీవన్‌రావు జయంతి వేడుకలు

ఉదయగిరి: డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 115వ జయంతి వేడుకలు బుధవారం ఉదయగిరిలో ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్, సిబ్బంది, మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో డీన్ కరుణసాగర్, సిబ్బంది, విద్యార్థులు జగ్జీవన్‌రావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సీనియర్, జూనియర్ సహాయకులు సీతారామాంజనేయులు, సమద్, కార్యదర్శులు అమర్‌నాథ్ రెడ్డి, కరీముల్లా, సిబ్బంది ఖాజా, మస్తాన్, వ్యవసాయ కళాశాల ఆచార్యులు గోపికృష్ణ, అనిల్‌కుమార్, రమణమూర్తి, రాధాకృష్ణ, శోభారాణి పాల్గొన్నారు.

కలిగిరి: కలిగిరిలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు బాబూ జగ్జీవన్‌రావు జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్, ఎంఈఎఫ్, ఎంఎస్‌పీ నాయకులు పాల్గొన్నారు.

జలదంకి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం బాబూజగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఎంపీపీ వెంకటరమణయ్య, ఎంపీడీఓ శ్రీధర్‌బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు మస్తాన్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొండాపురం: మండలంలోని సాయిపేట సచివాలయంలో బుధవారం సర్పంచ్ పాలకీర్తి కోటేశ్వరమ్మ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవులు, వీఆర్వో ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కార్యాలయంలో..

కావలి: పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ బాబుజగ్జీవన్‌రామ్ 115వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహనీయులను ఎప్పుడు స్మరించుకుంటూ ఉండాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్లూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బాబూజగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఓ షేక్ మస్తాన్, ఈఓపీఆర్డీ వీరేంద్ర, సిబ్బంది, పాల్గొన్నారు.



జగ్జీవన్‌రాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ



కావలి: జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



ఉదయగిరి: నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ సిబ్బంది

రైతులకు రెండో పంటకు అవకాశం

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మహిళలకు శాశ్వత భూహక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి

బిట్రగుంట: ఎస్పీపీఎం కింద రైతులు రెండో పంట వేసుకోవచ్చని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి భరోసా ఇచ్చారు. బుధవారం బోగోలు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఆసరా కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు సాగునీరు అందించే విషయంలో ఇప్పటికే ఆయా శాఖల అధికారులతో చర్చించామన్నారు. రైతులు పత్తి, వేరుశనగ, మిరప పంటలతో పాటు వరి పంట కూడా వేసుకోవచ్చన్నారు. త్వరితగతిన పంటలు వేసుకుంటే నీటి ఎద్దడి తలెత్తకముందే సాగు పూర్తి చేసుకోవచ్చని వివరించారు.

చుక్కల భూములకు విముక్తి

చంద్రబాబు హయాంలో పేదల భూములను నిషేధిత చుక్కల భూముల జాబితాలో చేర్చడంతో నిరుపేద రైతులు భూములు అమ్ముకోలేక, బ్యాంక్‌ల్లో రుణాలు పొందలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఎమ్మెల్యే అన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రైతులకు భూములపై హక్కులు కల్పించేందుకు తీవ్రంగా శ్రమించారని తెలిపారు. ఉన్నతాధికారులు, న్యాయనిపుణులతో చర్చించి, భవిష్యత్‌లో రైతులకు ఎటువంటి చిక్కులు రాకుండా పేదల భూములు చుక్కల భూముల జాబితాలో నుంచి తొలగించి పట్టాలు అందించేందుకు మూడేళ్ల సమయం పట్టిందన్నారు. మార్చి 31న జీఓ నంబరు 153 ద్వారా చుక్కల భూములకు విముక్తి కలిగించారని వివరించారు. దీంతో ఒక్క బోగోలు మండలంలోనే సుమారు ఐదు వేల మంది రైతులకు చెందిన 2,700 పైచిలుకు ఎకరాలకు మోక్షం లభించిందని వివరించారు. 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూ రక్ష' కింద రీసర్వే పూర్తయిన తాళ్లూరు, సాంబశివపురం, మల్లాయపాళెం గ్రామాల రైతులకు ఐదుగురి వంతున లాంఛనంగా కావలి ఆర్డీఓ శీనానాయక్, తహసీల్దార్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణతో కలిసి భూహక్కు పత్రాలు పంపిణీ చేశారు.

సంగమేశ్వరాలయం పాలకమండలి ప్రమాణస్వీకారం



సంగమేశ్వరుడి దేవస్థానం పాలకమండలి

సంగం: సంగంలోని కామాక్షిదేవి సమేత సంగమేశ్వర స్వామి దేవస్థానంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆలయ బ్రహ్మోత్సవ కమిటీ చైర్మన్, పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం జరిగింది. సంగంకు చెందిన ఆర్యవైశ్య నాయకుడు పెరుమాళ్ల రవీంద్రబాబును తాత్కాలిక చైర్మన్‌గా నియమించారు. ఆలయ ఈఓ ప్రసాద్ చైర్మన్‌తో పాటు నూతనంగా నియమించిన పాలక మండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు నూతన కమిటీని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ పెరుమాళ్ల రవీంద్ర బాబు మాట్లాడుతూ ఆలయ కమిటీలో ఆర్యవైశ్యులకు చోటు కల్పించిన ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అందరి సహకారంతో కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, నాయకులు రఘునాథ్‌రెడ్డి, రావుల ప్రసాద్‌గౌడ్, కాకు మధుసూదన్ యాదవ్, చందన్ కుమార్, ఫణీంద్రరెడ్డి, పట్టాభిరామిరెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరా చెక్ అందజేత



వైఎస్సార్ ఆసరా నమూనా చెక్‌ను అందజేస్తున్న ఎంపీపీ, సర్పంచ్‌లు, నాయకులు

మర్రిపాడు: మర్రిపాడులో వైఎస్సార్ ఆసరా మూడో విడత పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గంగవరపు లక్ష్మీదేవి మాట్లాడుతూ మహిళలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా వైఎస్సార్ ఆసరా మూడో విడతలో మండలంలోని 5,774 మంది మహిళలకు రూ.4.42 కోట్లు అందజేశారన్నారు. ఎన్నికల్లో చెప్పడమే కాకుండా చేసి చూపించారన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు చేపడుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని ఆదరించాలన్నారు. అనంతరం ఆసరా నమూనా చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గంగవరపు శ్రీనివాసులునాయుడు, మండల జేసీఎస్ కో ఆర్డినేటర్ సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి, చిలకపాడు, మర్రిపాడు సర్పంచ్‌లు సిద్ధంరెడ్డి రమాదేవి, షేక్ బీబీజాన్, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

2024లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం



కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

సోమశిల: గ్రామ సచివాలయ పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు సమన్వయంతో ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని అనంతసాగరం మండల జేసీఎస్ కో-ఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి అన్నారు. బుధవారం ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మతో కలిసి అనంతసాగరంలోని రెండు సచివాలయాల పరిధిలో ప్రత్యేక సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా గృహసారథులు, వలంటీర్లకు 'జగనన్నే మా భవిష్యత్' కిట్లను అందజేశారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అభివృద్ధే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తున్నారని, అందుకు మనందరం పార్టీ అభివృద్ధి కోసం పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొర్రా శోభ, మండల కో ఆప్షన్ సభ్యుడు కరిమొహిద్దీన్ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీని బలోపేతం చేద్దాం

- కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి



అన్నవరంలో వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు మాలకొండారెడ్డితో మాట్లాడుతున్న వంటేరు

జలదంకి: ఉదయగిరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని కావలి మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రాజకీయ సలహా కమిటీ సభ్యుడు వంటేరు వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం వంటేరును జలదంకి, కొండాపురం జెడ్పీటీసీ సభ్యులు మేదరమెట్ల శివలీల, ఎల్లావుల వెంకటరావు, వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా వారితో స్థానిక పరిస్థితులపై చర్చించారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని జిల్లా ఆస్పత్రిలో భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, కార్యకర్తలు ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా 58 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లోని బ్లడ్ బ్యాంకుల్లో స్టోరేజ్ కేంద్రాల్లో సరిపడా రక్తం నిల్వలు ఉండేలా ఆయా డాక్టర్లు, సిబ్బంది కృషి చేస్తున్నారన్నారు. ముఖ్యంగా ఆత్మకూరు ఆస్పత్రిలో కాన్పులు అధికంగా జరుగుతుంటాయని, గర్భిణులకు కాన్పుల సమయంలో రక్తం అవసరాలు వస్తున్నాయన్నారు. ప్రస్తుతం సేకరిస్తున్న ఈ యూనిట్‌లను గర్భిణులకు కేటాయించనున్నట్లు ఆమె తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం 22వ సారి రక్తదానం చేయగా, ఎస్సై శివశంకర్‌రావు 10వ సారి రక్తదానం చేశారు. ఈకార్యక్రమాల్లో ప్రభుత్వాస్పత్రి వైద్యులు బాలాజీ, లావణ్య, పూజిత, రెడ్ క్రాస్ కార్యదర్శి సాధిక్ హుస్సేన్, షార్డ్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రపర్వం కోదండరాముడి కల్యాణం



సీతారాముల కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లి కోదండరామస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సీతారాముడి కల్యాణం బుధవారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చారు. అర్చకులు శాస్త్రోక్తంగా కన్యాదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కల్యాణాన్ని శుభ ముహూర్తంలో నిర్వహించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు శ్రీరామ స్మరణ చేస్తూ కల్యాణ ఘట్టాన్ని తిలకించారు. ఉభయకర్తలుగా జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి, వసంతకుమారి వ్యవహరించారు.